క్లుప్తంగా

నూతన పైప్‌లైన్ ఏర్పాటు



అమరాపురం: మండల పరిధిలోని హనుమంతనపల్లిలో బోరుబావి నుంచి బసనవపల్లి రోడ్డు వరకు సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పైపులైనును ఏర్పాటు చేశారు. బోరుబావి నుంచి ఉన్న పైపులైన్ మరమత్తుకు నోచుకోవడంతో గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బోరుబావి నుంచి అంగన్‌వాడీ కేంద్రం సమీపం వరకు కొత్తగా పైపులైను ఏర్పాటు చేయించారు. దీంతో నీటి సమస్య పరిష్కారమైంది.

బస్సుఢీ.. వ్యక్తికి గాయాలు



ప్రమాద స్థలం వద్ద గుమిగూడిన జనం

మడకశిరరూరల్: మండల పరిధిలోని తడకలపల్లి గ్రామ సమీపంలోని ఎల్లోటి క్రాస్ వద్ద హైవే రోడ్డుపై మంగళవారం కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఎల్లోటికి చెందిన జి శివప్పకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేయించి మెరుగైనా వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. తడకలపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో శివప్ప ఎల్లోటికి వెళ్లడానికి హైవేలో వెళ్తుండగా హిందూపురం నుంచి మడకశిర మీదుగా పావగడ వెళ్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీ కొన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి బస్సును స్టేషన్ వద్ద ఉంచారు.

గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి వామి

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామంలో మహిళా రైతు ఈరమ్మకు చెందిన గడ్డివాము విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం దగ్ధమైంది. ఈరమ్మ పెంపుడు జీవాల కోసం దాదాపు 10 లోడ్లకు పైగా ఉన్న గడ్డివామును కల్లంలో భద్రపరిచారు. అయితే పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గడ్డివామిపై నిప్పు రవ్వలు పడ్డాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు 90 శాతం గడ్డివాము కాలిపోయింది. రూ.లక్ష నష్టం వచ్చిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.


ప్రిన్సిపాల్‌కు అభినందన



ప్రిన్సిపాల్ నాగేంద్రను అభినందిస్తున్న టీఎన్ దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్‌ను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అభినందించారు. నాగేంద్రకుమార్ కొన్నేళ్లుగా విద్యార్థులను ఉన్నతస్థాయిలో నిలిపేందుకు చేస్తున్న కృషిని గుర్తించి విశాఖలోని ఏపీ థియోలాజికల్ యూనివర్సిటీ సేవారత్న లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ఇవ్వడం హర్షణీయమన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దీపికతో పాటు వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి ప్రిన్సిపాల్ నాగేంద్రను సత్కరించారు.

వేలంపాట నిలిపివేయాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం: కొట్నూరు చేపల చెరువు వేలంపాట నిలుపుదల చేసి తిరిగి బహిరంగ వేలాలు నిర్వహించాలని సీపీఐ, జై భీమ్ పార్టీ, ఎంఎస్ఎఫ్ ప్రజా సంఘాల నాయకులు తహశీల్దార్ వెంకటేష్‌కు వినతి పత్రం అందించారు. నిబంధనకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రజలను మభ్యపెట్టి ఏకపక్షంగా చేపల చెరువు వేలం వేయడం సమంజసంకాదన్నారు. వేలం పాట నిలుపుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ కార్యదర్శి వినోద్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, టీఎస్‌టీయూసీ తాలూకా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే.వి చలపతి, ఎంఎస్ఎఫ్ నాయకుడు రవికుమార్, జై భీమ్ పార్టీ నాయకుడు ఊటుకూరు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కాలం





ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లిలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

- 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి గైడ్ చేస్తున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో రోజూ ప్రత్యేక శిక్షణ

పరిగి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పరీక్షల ప్రశ్నాపత్రాలు ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లకు చేరగా ప్రత్యేక గదుల్లో అధికారులు భద్రపరిచారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు.

నియోజకవర్గం నుంచి 3,724 మంది

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రధానంగా పరీక్షల నిర్వహణ కేంద్రాలను ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేటాయింపు పూర్తి చేశారు. ప్రశ్నాపత్రాలు ఆయా మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లను భద్రపరిచారు. పెనుకొండ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 3,724 మంది పేదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

రాత్రివేళల్లో విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

గతేడాది డిసెంబర్ మాసానికే సిలబస్‌లు పూర్తి చేశారు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా రెండు నెలలుగా స్లిప్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు, మోడల్ పేపర్లను రాయిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తయారు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ముగిసిన తరువాత రాత్రి వేళల్లో ఎలా చదువుతున్నారో తెలుసుకోవడానికి, అలాగే చదివేటప్పుడు తలెత్తిన అనుమానాలను నివృత్తి చేయడానికి సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల మంచి ఫలితాలను సాధించడంతో పాటూ విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనలు పోగొట్టేందుకు దోహదపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో పది విద్యార్థుల సంఖ్య

మండలం	విద్యార్థులు
పరిగి	716
రొద్దం	430
సోమందేపల్లి	506
పెనుకొండ	990
గోరంట్ల	1082



సోమందేపల్లిలో విద్యార్థుల ఇంటి వద్దకే వెళ్లి సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు

బాగా తర్ఫీదు ఇస్తున్నారు



ఏకాగ్రతతో చదువుతున్నాను. ఒక్క మార్కు కూడా పోకుండా ప్రతి సబ్జెక్టులో వందకు వంద మార్కులు సాధించడానికి కృషి చేస్తున్నాను. దీని కోసం పాఠశాలలో ఉపాధ్యాయులు నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ తగిన విధంగా తర్ఫీదునిస్తున్నారు. పరీక్షలు బాగా రాసి పాఠశాలతో పాటూ తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తా.

– చరణ్‌తేజ, 10వ తరగతి

కష్టపడి చదువుతున్నా..



తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో వందకు వంద సాధించడానికి కష్టపడి చదువుతున్నాను. ప్రధానంగా గ్రామర్, హ్యాండ్ రైటింగ్‌పై దృష్టి సారిస్తున్నాను. మ్యాథ్స్, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు సాధిస్తానన్న నమ్మకముంది.

– లక్ష్మీనరసింహారెడ్డి, 10వ తరగతి

మంచి మార్కులు సాధిస్తా..



గత కొన్ని నెలలుగా కేవలం పరీక్షలకు సంబంధించిన గ్రాండ్ టెస్టులు, మోడల్ పేపర్లను మా ఉపాధ్యాయులు రాయిస్తున్నారు. దీంతో పాటు ప్రతి సబ్జెక్టులోనూ అనుమానాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ చదువుతున్నాను. పబ్లిక్ పరీక్షలంటే ఇక భయం లేదు. ప్రశాంతంగా రాసి, మంచి మార్కులు సాధిస్తా.

– విశ్వకిరణ్, 10వ తరగతి

ఆందోళన వద్దు



పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచాం. ఇప్పటికే ఫస్ట్, సెకండ్ సెట్, ఫస్ట్ స్పెల్ ప్రశ్నాపత్రాలు చేరాయి. మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తున్నాం. గదిలో తాగునీరు, ఫ్యాన్లు, గాలి వెలుతురు ఉండేలా చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– లక్ష్మీదేవి, ఎంఈఓ, పరిగి మండలం

ఉషశ్రీచరణ్‌ను కలిసిన మాజీ మంత్రి శైలజానాథ్



శైలజానాథ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. అనంతరం ఉషశ్రీచరణ్... శైలజానాథ్‌ను శాలువాతో సత్కరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి

మడకశిర: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలో మంగళవారం ఫోర్‌వీలర్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలి వేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోండి

పెనుకొండ: రైలు ప్రమాదంలో మృతి చెందిన నరసింహులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘం , సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను నాయకులు హరి, బాబావలి, రమేష్ పరామర్శించారు. నరసింహులు భార్యకు ఉద్యోగంతో పాటు అతని ముగ్గురు పిల్లలకు ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు.

ఆవిర్భావ దినోత్సవానికి హాజరుకండి

పెనుకొండ రూరల్: పట్టణంలోని మడకశిర రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం 8:30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి ఒక పత్రికటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అమరాపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు. అనంతరం పుట్టపర్తిలో నిర్వహించే యువత పోరుకు తరలివెళ్దామన్నారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నిస్సార్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో బుధవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యులు, నాయకులు పాల్గొని కేక్ కట్ చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యాంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలి



ఎస్సీ రైతులకు స్ప్రేయర్లు అందజేసిన దృశ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎస్సీ ఉప ప్రణాళిక కింద భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ఎస్సీ యువ రైతులకు ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. డీన్ డాక్టర్ సరోజినిదేవి మాట్లాడుతూ రైతులు మెట్ట ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు వినియోగించడం ద్వారా నీటిని ఆదా చేసి ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ యువ రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ రైతులకు ఉచితంగా బ్యాటరీ స్ప్రేయర్లను అందించారు. ఎస్సీ ఉపప్రణాళిక ప్రాజెక్టు సమన్వయకర్త కిశోర్, యాంత్రీకరణ విభాగపు అధికారి డాక్టర్ హరిబాబు, ఏఓ తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుకొండ: ఉపాధ్యాయ సమస్యలపై మంగళవారం విజయవాడలోని విద్యాభవన్‌లో పాఠశాల విద్యా డైరెక్టర్ పార్వతిని కలసినట్లు ఏపీ ఎస్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలుగా గుర్తించిన ప్రతి పాఠశాలకు హెచ్‌ఎం, పీడీ పోస్టులు కేటాయించాలని విన్నవించామన్నారు. సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరామన్నారు. ప్రతిభ ఆధారిత పాయింట్లు రద్దు చేయాలని, నెలవారీ పదోన్నతులు భర్తీ అంశాన్ని ట్రాన్స్‌ఫర్ యాక్ట్‌లో చేర్చాలని విన్నవించామన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పెనుకొండ రూరల్: తడి చెత్త, పొడిచెత్త సేకరణలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి సమత ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని రాంపురం, గుట్టూరు, మునిమడుగు పంచాయతీ గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల ప్రజలతో డీపీఓ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరుగా చేసి తరలించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంటేనే అనారోగ్యం బారిన పడకుండా ఉంటామన్నారు. అనంతరం చెత్తతో సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీదేవి, సెక్రటరీలు జమీర్, గంగరత్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

మడకశిరరూరల్: మండలంలోని రైతులు భూసార పరీక్ష చేయించుకుని ఫలితాల ఆధారంగా ఎరువులను వాడాలని, అప్పుడే పెట్టుబడి తగ్గడంతో పాటు నేల ఆరోగ్యంగా ఉంటుందని ఏఓ తిమ్మప్ప తెలిపారు. మంగళవారం ఆర్ ఆనంతపురం గ్రామంలో భూసార పరీక్ష , ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువత పోరుకు తరలిరండి



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వం మోసాలను ఎప్పటికప్పుడు ఎండగతడామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. మంగళవారం హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె 'యువత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగే 'యువత పోరు' కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీపిక మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4,800 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలాగే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి కనీసం ఆలోచించే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబు చేసిన తొలిసంతకం ఉత్తుత్తిదేనని దుయ్యబట్టారు. చేతకాని హామీలిచ్చి అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో బుధవారం నిర్వహించే యువత పోరుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువత, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం రోజే ప్రజల కోసం మరో పోరాటం మొదలుపెడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు మనోజ్ జులియట్(మింటు), విద్యార్థి జిల్లా ఉపాధ్యక్షుడు కదిరీష్, పార్టీ కార్యదర్శులు, మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, రాము , కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే యువతపోరుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగభృతి మంజూరు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. వారికి న్యాయం చేయడానికే మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మడకశిరలో ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ముగించుకుని పుట్టపర్తిలో జరిగే ర్యాలీకి బయలు దేరాలని కోరారు.

రొళ్ల: పుట్టపర్తిలో బుధవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి 10 గంటలలోపు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

గ్రాండ్ టెస్ట్ పరిశీలన

రొళ్ల: మండలంలోని రత్నగిరి, అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జీవశాస్త్రంపై జరుగున్న గ్రాండ్ టెస్ట్‌ను ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు. తొలుత వెంకటంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

నేడు కాంప్లెక్స్ సమావేశాలు

రొళ్ల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నూతన కాంప్లెక్స్‌లో సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్టకు విరాళాల సేకరణ

అమరాపురం: స్థానిక హేమావతి, మడకశిర రోడ్డు కూడలిలో కుంచిటి వక్కలిగుల మూల పురుషుడు కెంపేగౌడ విగ్రహ ప్రతిష్టకు అమరాపురం పట్టణంలో కెంపేగౌడ యువక సంఘం ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. మంజునాథ, నగేష్, తిప్పేస్వామి, మల్లికార్జున, అనిల్‌కుమార్, రాఘవేంద్ర జగన్నాథ, విశ్వ తదితరులు వ్యాపార దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి వారికి విరాళాలను సేకరిస్తున్నారు.

120 మంది విద్యార్థుల గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గంలో మంగళవారం జరిగిన ఇంటర్ పరీక్షకు 120 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. మడకశిరలో 4 కేంద్రాలు, అగళి, గుడిబండ, అమరాపురంలో ఒక్కో కేంద్రంలో పరీక్షలు జరిగాయి. మొత్తం 2,268 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా... 2,148 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. మొత్తం 120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు.

చికిత్స పొందుతూ జేడీఎస్ నేత మృతి

పావగడ: స్థానిక జేడీఎస్ సీనియర్ నేత శివప్ప నాయక (62) చికిత్స పొందుతూ మంగళవారం బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. గత నెల 23న మధుగిరి నుంచి పావగడకు వస్తూ బేడ్తూరు గ్రామం వద్ద కారు అదుపు తప్పి నీటి తొట్టెను ఢీ కొనడంతో ఆయన గాయపడ్డారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎన్ఏ ఈరణ్ణ, జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, తిమ్మారెడ్డి, సొగడు వెంకటేశ్ తదితరులు సంతాపం తెలిపారు.

చెట్లు నరికితే చర్యలు తప్పవు

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామ సమీపంలోని అగ్రీ గోల్డ్ భూముల్లో ఎవరైనా చెట్లును నరికేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. అగ్రీ గోల్డ్ సంస్థ వారు పెంచిన నీలగిరి చెట్లను కొందరు అక్రమార్కులు నరికేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పావగడ: అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ గిరీశ్ హెచ్చరించారు. అరసికెరె పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ సమస్యల వినంతి సభలో ఆయన మాట్లాడారు.

డీఎంకు ఎన్ఎంయూ నాయకుల వినతి

మడకశిర: ఆర్టీసీ డిపోలో అనేక సమస్యలు ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించి ఆర్టీసీ కార్మికులను ఆదుకోవాలని మంగళవారం ఎన్ఎంయూ నాయకులు రామకృష్ణ, ముద్దప్ప, శ్రీరాములు, షబ్బీర్, నరసప్ప, నాయక్ తదితరులు డిపో మేనేజర్ రామసుబ్బయ్యకు వినతి పత్రాన్ని అందించారు. ప్రధానంగా కార్మికులు, గ్యారేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు.

నేటి నుంచి నృసింహుని బ్రహ్మోత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి మూల విరాట్

- 14న బ్రహ్మరథోత్సవం, 19న భూతప్ప సేవ

రొళ్ల: పట్టణంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకూ నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 12న అంకురార్పణ, 13న కలశ స్థాపన, కల్యాణోత్సవం, యోగీశ్వరాధన, 14న బ్రహ్మరథోత్సవం, 15న వసంతోత్సవం, మీసలు (సేకరణ) కలియుట, రొళ్లకొండపై దివ్య జ్యోతి దర్శనం, 16న స్వామి వారి ఉత్సవం, గరుడోత్సవం, 17న పూల పల్లకీ ఉత్సవం, 18న దేవతా సంకీర్తనాలు, 19న భూతప్ప సేవలు (ఉత్సవం) తలనీలాలు సమర్పణ, 20న 101 ప్రసాద వినియోగం, భక్తులచే ముడుపుల ఉత్సవం, 21న మహామంగళారతి, భక్తులకు ప్రసాద వినియోగం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ముఖ్యంగా 14వ తేదిన జరిగే బ్రహ్మరథోత్సవం, 19వ తేదిన జరిగే భూతప్పల సేవలు రోజున వేలాది మంది భక్తులకు దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. 19న జరిగే భూతప్ప సేవలో... భూతప్పస్వామి కాలిస్పర్శ తాకితే తమ కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. వేడుకలకు హాజరయ్యే వారికి కోసం మడకశిర ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా శిరా, మధుగిరి, పావగడ, మడకశిర, పెనుకొండ ఇతరాత్ర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు కోరుతున్నారు.